సాక్షి తిరుపతి

శనివారం ¦ 18 ¦ మే ¦ 2024



ఫలితాలను శాసించే 'పోలింగ్'

జిల్లాలో 90శాతానికి పైగా ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలు ఎన్నికల ఫలితాలను శాసించనున్నాయి. - 10లో



పక్కాగా 'విద్యాహక్కు'

ప్రభుత్వం పక్కాగా విద్యాహక్కు చట్టం అమలు చేస్తోంది. పేద పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ విద్య అందిస్తోంది. - 10లో



మొదటి ఘాట్‌లో ప్రమాదాలు

తిరుమల మొదటి ఘాట్‌లో శుక్రవారం పలు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. దీంతో కొందరు భక్తులు గాయపడ్డారు. - 10లో

న్యూస్‌రీల్

వరసిద్ధుని సేవలో కలెక్టర్



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న అధికారులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారిని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం సేవించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆలయ మర్యాద చేశారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు కోదండపాణి, బాబు పాల్గొన్నారు.

పెంచలకోనకు ప్రత్యేక బస్సులు



అనిల్‌కుమార్, రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్

రాపూరు: మండలంలోని పెంచలకోన బ్రహ్మోత్సవాలకు 120 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాపూరు ఆర్టీసీ డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు, గూడూరు, రాపూరు, వెంకటగిరి, ఆత్మకూరు, ఉదయగిరి, వాకాడు, కావలి, వెంకటగిరి, గూడూరు, వైఎస్సార్ జిల్లా కడప, మైదుకూరు, రాజంపేట, బద్వేల్ నుంచి ప్రత్యేక బస్సులను శనివారం నుంచి నడపనున్నట్లు వివరించారు. 22న నృసింహ జయంతి, 23న శ్రీవారి కల్యాణం నేపథ్యంలో భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశముందని, ఆ మేరకు బస్సులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. అన్ని బస్సుల్లో మామూలు చార్జీలనే వసూలు చేయనున్నట్లు తెలిపారు.

27 నుంచి కల్యాణ వేంకటేశ్వరుని వసంతోత్సవాలు

తిరుపతి(అలిపిరి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక వసంతోత్సవాలను ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారీ సమేతంగా వసంతోత్సవంలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు, సీతాలక్ష్మణ హనుమ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి, రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామివారి ఉత్సవమూర్తులను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించనున్నట్లు వివరించారు. సేవలో పాల్గొనేందుకు దంపతులు రూ.516 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈక్రమంలోనే ఆర్జితసేవలను రద్దుచేసినట్లు వెల్లడించారు.

• పరిణయం.. రమణీయం



పద్మావతీ పరిణయోత్సవ వేడుకను శుక్రవారం తిరుమలలో రమణీయంగా నిర్వహించారు. నారాయణగిరి ఉద్యానవనంలో వికసించిన విశేష పుష్పాలతో వివాహ వేదికను శోభాయమానంగా అలంకరించారు. సర్వాలంకారభూషితుడైన శ్రీనివాసుడు గజవాహనంపై పెళ్లి మండపానికి వేంచేపు చేశారు. దేవదేవేరులకు కనులపండువగా కల్యాణ మహోత్సవం జరిపించారు. అనంతరం తిరుచ్చిపై సతీ సమేతంగా శ్రీవారు ఊరేగుతూ ఆలయ ప్రవేశం చేశారు. – తిరుమల

స్ట్రాంగ్ భద్రత

- పకడ్బందీగా బందోబస్తు
- నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిఘా
- కౌంటింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ కొనసాగింపు

తిరుపతి సిటీ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌కు మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భద్రతలో భాగంగా మొదటి అంచెలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో అంచెలో ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్, మూడో అంచెలో స్థానిక పోలీసులు 24గంటల పాటు విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ భద్రత, కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద అమర్చిన సీసీ కెమెరాల పర్యవేక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు ఆదితీ సింగ్, నిషాంత్‌రెడ్డి, నరసింహులు, అదనపు ఎస్పీ కులశేఖర్, డీఆర్‌ఓ పెంచలయ్య పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

కౌంటిగ్ కేంద్రానికి కట్టుదిట్టంగా..

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని, హింసాత్మక చర్యలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర సీఎస్ జవహార్‌రెడ్డితో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తే చర్యలు తీసుకోవాని సూచించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు 144 సెక్షన్ కొనసాగించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత, ప్రధాన ద్వారం వద్ద చెకింగ్ అమలు చేయాలని చెప్పారు. దీనిపై కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పందిస్తూ కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత కల్పించినట్లు చెప్పారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎంట్రన్స్ వద్ద అదనపు పోలీస్ బలగాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ శ్రీనివాస రావు, డీఆర్‌ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.

చల్లంగా చూడు తల్లీ!



అమ్మవారి ఆలయం వద్ద తోటి వేషధారి ప్రదర్శన

- తాతయ్యగుంట గంగమ్మకు తోటివేషాలతో మొక్కులు
- అమ్మవారికి సేవకు పోటెత్తిన భక్తులు

అమ్మా.. గంగమ్మ తల్లీ.. చల్లంగా చూడు అంటూ భక్తులు ప్రార్థించారు. జాతరలో భాగంగా మూడోరోజు శుక్రవారం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ దర్శనానికి పోటెత్తారు. తోటి వేషాలు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబసమేతంగా ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని సేవించుకుని తన్మయత్వం చెందారు. ఈ క్రమంలో నాలుగోరోజు శనివారం కైకాల, రజక కులస్తులు అనువంశిక వేషాలతో పురవీధుల్లో సంచరిస్తూ పూజలందుకోనున్నారు. అనంతరం గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు.

– తిరుపతి కల్చరల్



గంగమ్మకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు



వేపమండలతో అమ్మ సేవకు చిన్నారులు



కళాకారుల ప్రదర్శన

ఐకేఎస్‌తో వేదిక్ వర్సిటీ ఒప్పందం

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖకు చెందిన భారతీయ జ్ఞానపరంపర విభాగం (ఐకేఎస్)తో తిరుపతి ఎస్వీ వేదిక్ వర్సిటీ 'వైదిక వాఙ్మయ వ్యాసాల ప్రచురణ, తాళపత్ర గ్రంథాల డిజిటలైజేషన్'పై శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ వైదిక వాఙ్మయ వ్యాసాలను అధిక సంఖ్యలో ప్రచురించేందుకు వీలుగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రాచీన తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేసి ప్రచురించేందుకు మరో ఒప్పందం కుదిరిందని వివరించారు. అనంతరం జ్ఞానపరంపర విభాగ జాతీయ సమన్వయకర్త ప్రొఫెసర్ జి.సూర్యనారాయణమూర్తితో ఎంఓయూ మార్చుకున్నారు. రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి, ఆచార్య గోలి సుబ్రమణ్యశర్మ, ప్రొఫెసర్లు రాధేశ్యామ్, పవన్‌కుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ అంజిరెడ్డి పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వీసీ, ఐకేఎస్ సమన్వయ కర్త

విమానంలో విహారయాత్రకు విద్యాకుసుమాలు



చెన్నై విమానాశ్రయంలో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు

సత్యవేడు: మాధనపాళెం జెడ్పీఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధిస్తే విమానంలో విహార యాత్రకు పంపుతానని సురుటుపల్లె ఆలయ కమిటీ సభ్యుడు ఉమాపతి ప్రకటించిన విషయం విధితమే. అందులో భాగంగా విద్యార్థులు పురుషోత్తం (552), వి. విష్ణు(515),మహా(509), తనూజ(505)తో పాటు ప్రధానోపాధ్యాయుడు మునిమోహన్‌ను శుక్రవారం చెన్నై నుంచి హైదరాబాద్‌కు విమానంలో పంపించారు. టికెట్లతోపాటు విద్యార్థుల రెండు రోజుల విహార యాత్రకు అయ్యే మొత్తం ఖర్చును ఉమాపతే భరిస్తున్నారు. ఈ మేరకు ఉమాపతిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ఆముదాలకోనలో ఒంటరి ఏనుగు!

- అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరిక



ఏనుగు పాదముద్రలు

చంద్రగిరి : మండలంలోని ఆముదాల కోన వద్ద అటవీ ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచరిస్తున్నట్లు పనపాకం రేంజ్ డీఆర్‌ఓ చిన్నబాబు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం అటవీ ప్రాంతంలో ఆయన పర్యటించి ఏనుగు కాలి గుర్తులను పసిగట్టారు. గతంలో తవణంపల్లె, పాకాల వద్ద ఇద్దరిని హతమార్చింది ఈ ఏనుగే అని గుర్తించామని డీఆర్‌ఓ వెల్లడించారు. ఈ మేరకు ఆముదాల కోన ఎస్టీ కాలనీ, కల్‌రోడ్డుపల్లె, మిట్టూరు, కాశిపెంట్ల, కొత్త ఇండ్లు ప్రజలకు తీసుకోవాల్సిన అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

మొదటి ఘాట్‌లో ప్రమాదాలు


బోల్తా పడిన వ్యాన్

తిరుమల : తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో శుక్రవారం పలు ప్రమాదాలు జరిగాయి. వివరాలు.. తమిళనాడుకు చెందిన భక్తులు మినీవ్యాన్‌లో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో కిందకు దిగుతుండగా మాల్వాడిగుండం సమీపంలో వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని కొందరు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వ్యాన్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ప్రమాద సమయంలో అటుగా వస్తున్న టీటీడీ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. అలాగే ఘాట్ 19వ మలుపు వద్ద తమిళనాడుకు చెందిన కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ క్రమంలోనే టీటీడీ వాటర్ ట్యాంకు కూడా డివైడర్‌ను ఢీకొంది.


డివైడర్‌ను ఢీకొన్న కారు

ఫలితాలను శాసించే పోలింగ్!

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇక కౌంటింగ్ ప్రక్రియ మాత్రమే మిగిలింది.. ఈ సమయంలో అభ్యర్థుల జయాపజయాలపై ముమ్మరంగా చర్చ సాగుతోంది.. ఓటింగ్ శాతం అధికంగా నమోదైన బూత్‌లపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.. ఫలితాలను శాసించనున్న ఆయా కేంద్రాలు ఎవరికి అనుకూలంగా ఓట్లు పడ్డాయో అనే విషయం అందరిలో ఉత్కంఠ రేపుతోంది. జిల్లాలో 90శాతానికి పైగా పోలింగ్ జరిగిన 319 సెంటర్లే అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశముంది.

- జిల్లాలో 319 బూత్‌లలో అధికశాతం ఓటింగ్
- అభ్యర్థుల భవితవ్యం తేల్చడంలో ఇవే కీలకం
- గెలుపోటములను నిర్దేశించేవి ఈ కేంద్రాలే..


ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు (ఫైల్)

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఈ నెల 13వ తేదీన పూర్తి అయినప్పటికి విజయావకాశాలపై జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ చర్చ సాగుతోంది. జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు 78.63 శాతం, తిరుపతి పార్లమెంట్‌కు 79.10 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేదీన తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టనున్నారు. ఈ క్రమంలో అంతా ఏ ఊరుల్లో....ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు పోలయ్యాయి. ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలం అనే అంశాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అసెంబ్లీ స్థానాలకు సంబంధించి 90శాతానికి పైగా 319 బూత్‌లలో పోలింగ్ నమోదైంది. వెయ్యికి పైగా ఓట్లు 94 బూత్‌లలో పడ్డాయి. అత్యధికంగా తొట్టంబేడు మండలం పెన్నలపాడులో 96.73శాతం, ఏర్పేడు మండలం వికృతమాలలో 96.12శాతం, శ్రీనివాసపురంలో 95.04శాతం, రేణిగుంట మండలం ఆల్లికేశంలో 95.65శాతం, శ్రీకాళహస్తి మండలం ఇనగలూరులో 94.98శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ఈ పోలింగ్ కేంద్రాలే అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపనున్నట్లు పలువురు విశ్లేషిస్తున్నారు. అలాగే మెజారిటీల్లోనూ కీలకంగా మారనున్నట్లు వివరిస్తున్నారు. ఈ క్రమమంలోనే తిరుపతి పార్లమెంట్ స్థానానికి సంబంధించి 322 పోలింగ్ బూత్‌లలో అధికశాతం ఓటింగ్ నమోదుకావడం గమనార్హం.

- సత్యవేడు నియోజకవర్గం కంచనపుత్తూరులో 1,011 ఓట్లు, చిల్లమత్తూరు- 1,053, వెరికింబట్టు ఎస్సీకాలనీ- 1022, నాగలాపురం -1,010, కన్నవరం-1,041, కళత్తూరు ఎస్సీ కాలనీ-1,060 ఓట్లు నమోదయ్యాయి.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బీవీపురం బూత్‌లో 1,047ఓట్లు, అన్నానంపల్లె-1,214, కరకంబాడి-1,076, తారకరామానగర్-1,106, ఆర్.మల్లవరం-1లో1,072, ఆర్.మల్లవరం-2లో 1,010, తూకివాకం-1,110, ఎర్రమరెడ్డిపాళెం-1,086, శ్రీకాళహస్తి పట్టణంలోని 20 బూత్‌ల్లో అధికశాతం ఓటింగ్ నమోదైంది.
- వెంకటగిరి నియోజకవర్గంలోని బ్రాహ్మణపల్లెలో 1,011, పెరమకొండ-1,012 ఓట్లు, జిలకపాడు-1,066 , మార్లపూడి-1,042, అనంతమడుగు- 1,055 తదితర 12 బూత్‌ల్లో అధికశాతం ఓట్లు పోలయ్యాయి.
- సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పుణ్యేపల్లెలో 1,000 ఓట్లు, బిరదవాడ- 1,000, పుద్దేరు-1,068, కల్లూరు-1,025 మరో 10 బూత్‌ల్లో వెయ్యి ఓట్లు దాటాయి.
- గూడూరు నియోజకవర్గంలోని రామలింగాపురంలో 1,024 ఓట్లు, పోట్లుపాళెం-1,035, మేకనూరు-1,068, తిక్కవరం-1,061, తదితర 14 బూత్‌ల్లో వెయ్యికి పైగా ఓట్లు నమోదయ్యాయి.
- చంద్రగిరి నియోజకవర్గంలోని భాకరాపేట బూత్‌లో 1,032 ఓట్లు, గుండ్లగుట్టపల్లె-1,195 ఓట్లు, వల్లివేడు-1,038, కుక్కలపాళెం ఎస్సీకాలనీ- 1,141 , ఓట్లువారిపాళెం ఎస్సీ కాలనీ-1,030 ఓట్లు, ఇరంగారిపల్లె-1,223, గానుగపెంట-1,128 తదితర 19 పోలింగ్ బూత్‌లలో వెయ్యికిపైగా ఓట్లు నమోదయ్యాయి.

90శాతానికి పైగా ఓట్లు పోలైన కేంద్రాలు (అసెంబ్లీ)

నియోజకవర్గం	పోలింగ్ బూత్‌లు
శ్రీకాళహస్తి	81
సత్యవేడు	67
వెంకటగిరి	28
చంద్రగిరి	46
గూడూరు	39
సూళ్లూరుపేట	58
తిరుపతి	లేవు
మొత్తం	319

జిల్లాలో వెయ్యి ఓట్లకు పైగా పోలైన కేంద్రాలు

నియోజకవర్గం	పోలింగ్ బూత్‌లు
శ్రీకాళహస్తి	20
సత్యవేడు	06
వెంకటగిరి	12
చంద్రగిరి	19
గూడూరు	14
సూళ్లూరుపేట	10
తిరుపతి	లేవు
మొత్తం	81


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.75,580
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,769
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.88,800
రిటైల్ వెండి గ్రాము	రూ.90.80

బోయకొండ గంగమ్మా..పాహిమాం



చౌడేపల్లె: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. గంగమ్మ తల్లీ శరణు అంటూ పూజల్లో పాల్గొన్నారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి, ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి 12 గంటల మధ్యలో రాహుకాల సమయంలో అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహిళలు ఉపవాస దీక్షలతో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించి తరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అన్నప్రసాదాల పంపిణీ

ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ పర్యవేక్షణలో సుమారు 2 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం బోయకొండ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకొన్న చోట జరుగుతున్న మరమ్మతు పనులను ఈఓ, చైర్మన్ పరిశీలించి తగు సూచనలు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి : మండలంలోని కోనంగివారిపల్లె సమీపంలో ఓ పాడుబడిన ఫ్యాక్టరీ వెనుక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు శుక్రవారం స్థానికులు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. గుర్తుతెలియన వ్యక్తికి సుమారు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, మృతి చెంది మూడు రోజులై ఉంటుందని వెల్లడించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు వివరించారు.

సప్తగిరి.. భక్తఝురి


నారాయణగిరి వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్ని నిండిపోవడంతో భక్తుల క్యూ శిలాతోరణం వరకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 76,369 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 41,927 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.63 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో శుక్రవారం భా రీగా వర్షం కురవడంతో తిరుమలలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మాడవీధులు జలమయమయ్యాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

నాటుబాంబు పేలి పెంపుడు కుక్కకు గాయాలు

చౌడేపల్లె: దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లె సమీపంలో శుక్రవారం నాటు బాంబు పేలి పెంపుడు కుక్కకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు చెంగారెడ్డి పెంపుడుకుక్కను పెంచుకుంటున్నాడు. శుక్రవారం ఇంటికి సమీపంలో ఉన్న ఒక రైతు మామిడితోటలోకి కుక్క వెళ్లింది. కొద్దిసేపటికి పెద్ద పేలుడు శబ్దం వచ్చింది. చెంగారెడ్డి అక్కడికి వెళ్లి చూడగా నాటు బాంబు పేలి కుక్క తీవ్రంగా గాయపడి ఉంది. దవడ భాగం చీలిపోయి ఉంది. వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు పాతిపెట్టిన నాటు బాంబును కొరకడంతో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు.

పక్కాగా 'విద్యాహక్కు'

బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండాలని విద్యా హక్కు చట్టం చెబుతోంది. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు చేపట్టింది. పేద పిల్లలకు సైతం కార్పొరేట్ విద్యనందించేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది జిల్లా నుంచి 827మందిని తొలి జాబితాలో ఎంపిక చేసింది.

- పేద పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ విద్య
- జిల్లాలో 827 మంది విద్యార్థులు ఎంపిక
- ఈ నెల 20లోపు అడ్మిషన్లు
- తొలి జాబితా విడుదల చేసిన విద్యాశాఖ


తిరుపతిలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో విద్యార్థికి అడ్మిషన్ చేయిస్తున్న జిల్లా నోడల్ అధికారి, తిరుపతి రూరల్ ఎంఈఓ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం సెక్షన్ 12(1) (సి) ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25శాతం మంది విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్లు ఇవ్వాలి. దీనికి అనుగుణంగా ప్రభుత్వం 2024–25వ విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జిల్లాలోని 34మండలాలకు గాను 31మండలాల నుంచి 1,407మంది పేద విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో నిబంధనలకు లోబడి ఉన్న 1,024మంది దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని అందులో 827మందిని ఎంపిక చేస్తూ విద్యాశాఖ మొదటి విడత జాబితాను విడుదల చేసింది.

జిల్లాలో ఎంపిక ఇలా..

విద్యాహక్కు చట్టం ప్రకారం సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో జిల్లాలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్‌లు అమలుచేస్తున్న జిల్లాలోని 402 ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలలు రిజిస్ట్రేషన్లు చేసుకున్నాయి. అనంతరం ఆయా పాఠశాలలు ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకటో తరగతిలో ప్రవేశాలకు 25శాతం సీట్లను కేటాయించాలి. అందులో భాగంగానే విడుదల చేసిన తొలి విడత జాబితాలో 827మంది విద్యార్థులు సీట్లు పొందనున్నారు.

20లోపు అడ్మిషన్లు పొందాలి

విద్యాశాఖ విడుదల చేసిన జాబితా మేరకు జిల్లాలోని ఎంపిక చేసిన 827మంది విద్యార్థుల్లో ఇప్పటికే 600మందికి పైగా అడ్మిషన్లు పొందారు. మిగిలిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు ఎంపికైన పాఠశాలలకు వెళ్లి సంబంధిత ధ్రువీకరణపత్రాలను సమర్పించి అడ్మిషన్లు పొందాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోండి



ఉచిత విద్యాహక్కు చట్టం మేరకు పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ఇప్పటికే తొలివిడత జాబితాలో 827మంది లబ్ధి పొందగా, వారిలో 600కుపైగా విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మిగిలిన వారు ఈ నెల 20వ తేదీలోపు ఎంపికైన ఆయా పాఠశాలలకు వెళ్లి అడ్మిషన్లు పొందాలి. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని పేద విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

\- శేఖర్, డీఈఓ, తిరుపతి

నమ్మొద్దు.. మోసపోవద్దు!

- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోకండి
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- రిజిస్ట్రేషన్, రికగ్నైజేషన్‌పై ఆరా తీయండి
- క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారా... పరిశీలించండి
- ఆ తర్వాతే పిల్లలను చేర్పించండి



తిరుపతి సిటీ: జిల్లా కేంద్రంతో పాటు వివిధ పట్టణాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్ల హడావుడి మొదలైంది. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే గత రెండు నెలల నుంచి జిల్లాలోని సీబీఎస్ఈ, సాధారణ పాఠశాలల్లో అడ్మిషన్ల కోలాహలం నడుస్తోంది. ఎల్‌కేజీ, యూకేజీ, ఫస్ట్ క్లాస్ ప్రవేశాలకు ప్రైవేటు యాజమాన్యాలు గాలం వేసేందుకు ఆకట్టుకునే ప్రచారాలను ముమ్మరం చేశాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఇంటింటా ప్రచారం ముమ్మరం చేశాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలలో టాలెంట్, కాన్సెప్ట్, ఇంటర్నేషనల్, టెక్నో, ఒలంపియాడ్, ఐఐటీ, నీట్ వంటి ట్యాగ్‌లైన్లతో పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పెద్ద ఎత్తున వెలుస్తున్నాయి. వీటిలో కొన్ని విద్యాసంస్థలకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉండగా, మరికొన్నిటికి పూర్తిగా అనుమతులే లేవు. ఇంకొన్ని పాఠశాలలు, కళాశాలలు బ్రాంచీల పేరుతో నడుపుతున్నారు.

ఆ ప్రచారాలను నమ్మొద్దు

విద్యాసంస్థల నిర్వాహకులు అడ్మిషన్లు పెంచుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునేలా సరికొత్త ప్రచారాలతో గాల వేయడానికి ప్రయత్నిస్తుంటారు. తమ విద్యాసంస్థలో ఇటీవల విడుదల చేసిన ఫలితాలలో టాప్ ర్యాంకులు వచ్చాయని ఊదరగొడుతుంటారు. అడ్మిషన్ల సమయంలో టెస్టులు పెడుతూ వచ్చిన మార్కుల ఆధారంగా డొనేషన్లలో డిస్కౌంట్ అంటూ వ్యాపార ప్రకటనలు చేస్తుంటారు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, అధునాత భవనాలు, టాయ్‌లెట్లు, ప్లేగ్రౌండ్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ప్రాథమిక స్థాయ నుంచే టోఫెల్, ఐఐటీ, నీట్, టెక్నో, ఐఏఎస్ శిక్షణ ఇస్తామంటూ తల్లిదండ్రులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఈ విషయాలలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి.

వీటిపై ఆరా తీయ్యండి

ప్రతి విద్యాసంస్థ ప్రభుత్వ నుంచి కచ్చితంగా రికగ్నైజేషన్ పొంది ఉండాలి. ఇది నిబంధన. అయితే చాలా విద్యాసంస్థల బోర్డులు, ప్రకటనలు నిశితంగా పరిశీలిస్తే రిజిస్టర్డ్ అని ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఎవరైనా చేసుకోవచ్చు. కానీ విద్యాశాఖ నుంచి రికగ్నైజేషన్ తీసుకోవడం తప్పనిసరి. రికగ్నైజేషన్ పొందిన విద్యాసంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యాసంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే పరిగణిస్తుంది. మరికొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు బ్రాంచీల పేరుతో పాఠశాలలను, కళాశాలలను నడుపుతూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచ్ ద్వారా పరీక్షలు రాయిస్తుంటాయి. ఇలాంటి విషయాయలలో తల్లిదండ్రులు కచ్చితంగా విద్యాసంస్థ అనుమతి పత్రాలను అడిగి తెలుసుకోవాలి. రిజిస్ట్రేషన్‌తో పాటు రికగ్నైజేషన్ పొందిన పత్రాలను అన్ని విద్యాసంస్థలు నోటీసు బోర్డులో ఉంచాలనే నిబంధన ఉంది.

క్వాలిఫైడ్ టీచర్లేనా?



జిల్లాలో పలు ప్రైవేటు విద్యాసంస్థలలో క్వాలిఫైడ్ అధ్యాపకులు లేకుండా నడుస్తున్నాయి. 10వ తరగతి, ఇంటర్ చదివే విద్యార్థులకు సైతం డిగ్రీ, ఇంటర్ చదివిన వారే అధ్యాపకులుగా బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్‌గా సబ్జెక్ట్ మీద పట్టు దొరకడం లేదు. కేవలం బట్టి ప్రక్రియతో విద్యార్థులను రాత్రి, పగలు హింసించి పరీక్షలు రాయిస్తున్నారు. దీంతో పరీక్షలలో మంచి మార్కులు సాధించిన పోటీపరీక్షలలో చతికలపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలకు బీఈడీ, జూనియర్ కళాశాలకు పీజీ, స్లెట్, నెట్ స్థాయి అధ్యాపకులు ఉండాలి. కొన్ని విద్యాసంస్థలు నిబంధనలు పూర్తిగా పాటించడం లేదు. తల్లిదండ్రులు పిల్లలకు అడ్మిషన్లు తీసుకునే సమయంలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించిన తర్వాతే అడ్మిషన్లు పొందాలి. లేకుంటే విద్యార్థుల జీవితం అయోమయంలో పడ్డట్టే.

స్వయంగా విద్యాసంస్థను పరిశీలించాలి. క్రీడామైదానాలు లేని, అపార్ట్‌మెంట్ భవనాలలో, ఇరుకు సందులలో ఉండే విద్యాసంస్థలలో పిల్లలను చేర్చకుండా ఉంటే మంచిది. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండాలంటే క్రీడలు ఎంతగానో తొడ్పడతాయి. ఇరుకు గదులు, సందులలో ఉండే పాఠశాలల్లో ప్రమాదాలు జరిగితే భారీ నష్టం జరిగే అవకాశం ఉంది. అగ్నిమాపక శాఖ అనుమతి కూడా ప్రతి విద్యాసంస్థ కలిగి ఉండాలి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



జిల్లాలో ప్రతి ప్రైవేటు విద్యాసంస్థ ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి. విద్యార్థులకు పాఠశాలల్లో క్రీడా మైదానంతో పాటు అన్ని వసతులు పక్కాగా ఉండాలి. లేకుంటే ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేస్తాం. అదేవిధంగా విద్యాసంస్థ పక్కాగా రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రభుత్వ రికగ్నైజేషన్ తప్పక పొంది ఉండాలి. రిజిస్ట్రషన్ మాత్రమే కలిగి ఉంటే సరిపోదు. తల్లిదండ్రులు ప్రైవేటు సంస్థల ఆకట్టుకునే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు.

–డాక్టర్ వీ.శేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి, తిరుపతి జిల్లా